APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | శనివారం | 17 - 05 - 2025 | సంపుటి : 15 | సంచిక : 284 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి



పాక్ దురాగతాలపై విదేశాల్లో ప్రచారం

2 లో..



హరీష్ రావు నివాసానికి కెటిఆర్

2 లో..

# మరింత ఆయుధ సంపత్తి!

- ఆపరేషన్ సిందూర్‌తో పెరగనున్న రక్షణ బడ్జెట్
- మరో 50వేల కోట్లు కేటాయించనున్న కేంద్రం
- తాజా కేటాయింపులపై కేంద్ర సర్కార్ సన్నాహాలు?

**న్యూఢిల్లీ - నీలగిరివార్త :**

భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణరంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- సమాచారం. ఆ రంగానికి రూ.50,000 కోట్ల మేర బడ్జెట్ లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సన్నాహాలు చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశాలున్నాయి. దాంతో రక్షణశాఖకు కేటాయించిన నిధులు రూ.7 లక్షల కోట్లు- దాటుతాయని ఆ వర్గాలు తెలిపాయి. ఇండియన్ ఆర్మీ వరుస విజయాలు సాధించిన నేపథ్యంలో.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ శాఖకు మరో 50 వేల కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించాలని భావిస్తున్నట్లు- తెలుస్తోంది. పహల్గామ్ దాడి తర్వాత భారత్ ఏ విధంగా స్పందిస్తుందా..

మిగతా 2వ పేజీలో..



## కావాలంటే అసలు సినిమా చూపిస్తాం

- ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం
- అసలు సినిమా చూస్తామంటే చూపిస్తాం
- ఉగ్రవాదాన్ని ఆపకపోతే తడాఖా చూపుతాం
- మరోమారు పాక్‌కు రాజ్‌నాథ్ ఘాటు హెచ్చరిక
- భుజ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన రక్షణ మంత్రి



**భుజ్ - నీలగిరివార్త :**

దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాక్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు చూసిందంతా ఓ ట్రైలర్ మాత్రమేనని అన్నారు. శుక్రవారం భుజ్ ఎయిర్‌బేస్‌లో రాజ్‌నాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. ' ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ఇప్పటి వరకు చూసిందంతా ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినపుడు ప్రపంచం మొత్తానికి పూర్తి సినిమా చూపిస్తాం. పాకిస్తాన్‌ను ఇప్పుడు ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టాము. పాక్ తన బుద్ధి మార్చుకుంటే పర్లేదు. లేకపోతే కఠినమైన శిక్షలు వేస్తాం' అని అన్నారు. ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయిర్‌ఫోర్స్ అధికారుల పని తీరును పొగడటా నికి తనకు మాటలు సరిపోవటం లేదన్నారు. యావత్ దేశం తరపు నుంచి మరోసారి ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాకిస్తాన్ గడ్డమీద ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను మీరు ఎలా ధ్వంసం చేశారో ప్రపంచం మొత్తం చూసింది. తర్వాత కూడా వారి

మిగతా 2వ పేజీలో..



### పాక్‌తో దూరంగా తాలిబన్ ప్రభుత్వం

- జైశంకర్‌తో విదేశాంగ మంత్రి చర్చలు
- కలిసివస్తున్న అంతర్జాతీయ పరిణామాలు

2 లో..



## మంత్రి కొండా సురేఖ నిజాలు మాట్లాడారు

- తెలంగాణలో కాంగ్రెస్ కమిషన్ సర్కార్
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన కెటిఆర్
- తన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్నారన్న సురేఖ

**హైదరాబాద్- నీలగిరివార్త:**

వరంగల్‌లో గురువారం మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి. మంత్రులు డబ్బులు తీసిన తర్వాతే ఫైళ్లపై సంతకాలు పెడతారని ఆమె చెప్పిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా శుక్రవారం స్పందించారు. కొండా సురేఖ మాట్లాడిన కొన్ని నిజాలకు అభినందనలు అని, తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ కమిషన్ సర్కార్ నడుస్తోందని విమర్శించారు. 30 శాతం

మిగతా 2లో..

# మరింత కరెంట్!

- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్
- వచ్చే మూడేళ్లలో మరింతగా పెరిగే ఛాన్స్
- డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లక్ష్యం
- ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌పై దృష్టి
- ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్
- స్మార్ట్ పోల్స్ వినియోగంపై దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షలో సింఎం రేవంత్ స్పష్టీకరణ

**హైదరాబాద్- నీలగిరివార్త :**

వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. విద్యుత్‌శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ మారబోతోంది. విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ




విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్‌పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఓఆర్ఆర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు-అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎంకి అధికారులు వివరించారు. గత ఏడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగింది అన్నారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగు తుందని అంచనా వేశారు. 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు- ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది అన్నారు. విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి.. రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్టులకు విద్యుత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు- ఇతర కార్పొరేషన్లలో విద్యుత్

మిగతా 2వ పేజీలో..

# పాపం నిరుద్యోగులు!

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటే డబ్బులిచ్చారు
- హైదరాబాద్‌లో మరో కంపెనీ నిరుద్యోగులను సాఫ్ట్‌గా మోసం
- ప్యూరోపాల్ క్రియేషన్, ఐటీ సొల్యూ షన్స్ కంపెనీ పేరుతో దగా!
- ఒక్కొక్కరి నుండి రెండు నుండి రెండున్నర లక్షల వరుకు వసూలు
- వర్క్‌ఫ్రం హోమ్ అని నమ్మించి బోర్డ్ తిప్పేసి 200 మందికి శఠగోపం.
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు





**ప్రత్యేకప్రతినిధి - నీలగిరివార్త :**

నిరుద్యోగులకు బంపర్ ఆఫర్ అన్నారు. ట్రైనింగ్ ఇచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తామని నమ్మించారు. లక్షల్లో డబ్బులు వసూలు చేశారు. పోస్టింగ్ అంటూ చెప్పారు. వర్క్ ఫ్రం హోమ్ అన్నారు. చివరకు అందరినీ మోసం చేశారు. హైదరాబాద్‌లో మరో కంపెనీ నిరుద్యోగులను సాఫ్ట్‌గా మోసం చేసింది. ఉద్యోగాల పేరుతో లక్షలు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. వివరాల ప్రకారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో

మిగతా 2వ పేజీలో..

# ఖర్గేను ప్రధానిని చేస్తామనగలరా

- రాహుల్ చెబితే బిసి గణన అనడంలో అర్థం
- ఖర్గే కులగణన చేయాలని చెప్పలేదా
- రాహుల్‌నే ఎందుకు ప్రధాని చేస్తామంటున్నారు
- రేవంత్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన కొప్పుల ఈశ్వర్

**కరీంనగర్- నీలగిరివార్త :**

బీఆర్ఎస్ పగ్గాలు దళితునికి ఇవ్వాలంటున్న రేవంత్ రెడ్డి.. ఖర్గేను ప్రధాని చేస్తామని ఎందుకు అనడం లేదని.. రాహుల్ గాంధీనే పిఎం చేస్తామని ఎందుకు అంటున్నారని బిఆర్ఎస్ నేత,మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. రాహుల్ నాయకత్వంలో పని చేద్దామని రేవంత్ అంటారే తప్ప ఖర్గే నాయకత్వం గురించి మాట్లాడతారా అని అడిగారు. ఖర్గే దళితుడు కనుకనే ఆయనకు విలువ ఇవ్వడం లేదని అన్నారు. కులగణన రాహుల్ చెబితే చేశామని అంటాడు తప్ప ఖర్గే సూచనలతో అని ఎపుడైనా రేవంత్ అన్నాడా అని ప్రశ్నించారు. 50 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు కుల గణన ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి,



బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. తమ నేతలను బిల్లా రంగా అని సంబోధించడం ద్వారా రేవంత్ రెడ్డి సీఎం పదవి స్థాయిని తగ్గించారని ఆరోపించారు. బిల్లా రంగాల చేష్టలు రేవంత్ రెడ్డివే అని విమర్శించారు. బిల్లా రంగాల స్థాయిని

మిగతా 2వ పేజీలో..

# తీగ లాగారు డొంక కదిలింది

- వెలుగు చూసిన వంద కోట్ల మోసం
- అతి సాధారణ జీవితంనుంచి బడా వ్యాపారవేత్తగా మారిన బషారత్
- ఫోకస్ పెట్టిన డీఆర్ఐ అధికారులు
- పక్కా ఆధారాలు సేకరించి అరెస్టు
- కీలక దిగుమతి దారుల్లో ఒకరి అరెస్టుతో బషారత్ దొరికాడిలా!
- పదేండ్లుగా కార్ల అమ్మకాలు
- కార్ లాంజ్ అనే షోరూమ్
- బషారత్ నుంచి కార్లను కొనుగోలు చేసిందెవరు?
- కస్టమర్లు ఎవరనేది? గుర్తించేందుకు డీఆర్ఐ తీవ్ర అన్వేషణ?

**చెన్నూరి అన్వేషి - ప్రత్యేకప్రతినిధి నీలగిరివార్త :**

బిజినెస్‌మన్ బషరత్ ఖాన్ అరెస్ట్ విదేశాల నుంచి లగ్జరీ కార్ల దిగుమతిఅన్నీ హైఎండ్ మోడల్ కార్లేతక్కువ ధరకు ఇన్‌వాయిస్ కొటేషన్ పొలిటికల్ లీడర్లతో సన్నిహిత సంబంధాలుఅమెరికా, జపాన్ నుంచి వాహనాల కొనుగోలు దుబాయ్, శ్రీలంకలో మోడిఫికేషన్లు పూర్తిగా నగదు రూపంలోనే వాహన అమ్మకాలుబ్లాక్ మనీని వైట్ చేసేందుకు యత్నాలు చెశారు.

**పక్కాఆధారాలు సేకరించి అరెస్టు**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని కార్ లాంజ్ షోరూమ్ యజమాని, నగరానికి చెందిన వ్యాపారవేత్త బషారత్ ఖాన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) హై-ఎండ్ లగ్జరీ కార్ల దిగుమతికి సంబంధించి దాదాపు 100 కోట్ల రూపాయల భారీ కస్టమ్స్ సుంకం మోసం కేసులో అరెస్టు చేసింది. నిర్దిష్ట సమాచారం ఆధారంగా, భారతీయ ఓడరేవుల్లో ఉద్దేశపూర్వకంగా తక్కువ ఇన్వాయిస్‌లు ఇవ్వడం, తప్పుగా ప్రకటించడం ద్వారా లగ్జరీ వాహనాలను దాదాపు 50శాతం తక్కువ విలువతో భారతదేశంలోకి దిగుమతి చేసుకున్నట్లు డీఆర్ ఐ కనుగొంది.సూరత్‌లోని డీఆర్ ఐ అధికారులు బషారత్‌ను అరెస్టు చేసి అహ్మదాబాద్‌లోని ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. దాదాపు







రు100 కోట్ల మోసం జరిగిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.నిందితుడు పలు రాజకీయ నాయకులకు, ప్రముఖులకు కార్లను అందించే వాడని కూడా తెలుస్తోంది.

**పదేండ్లుగా కార్ల అమ్మకాలు**

హైదరాబాద్‌లోరాయదుర్గ్-గచ్చిబౌలి రోడ్డులో ఉంది. నిందితుడు నాంపల్లి, విజయ్ నగర్ కాలనీకి చెందినవాడు. అతని అన్నయ్యకు రెండు వర్క్‌షాప్ లు ఉన్నాయి. గత 10 సంవత్సరాలుగా, షోరూమ్ హైదరాబాద్‌లో పనిచేస్తోంది.గతంలో

మిగతా 2వ పేజీలో..



## ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం

- ఆర్మీకి కృతజ్ఞతగా నేడు బిజెపి తిరంగా యాత్ర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్- నీలగిరివార్త :**

భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు నిరూపించామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాక్ దిక్కుతోచని స్థితిలో కాళ్ల బేరానికి వచ్చిందని అన్నారు. దాని వైమానిక స్థావరాలు భారత్ దాడిలో ధ్వంసం

మిగతా 2వ పేజీలో..



## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

**మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ**

**రాజన్న సిరిసిల్ల :**

తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎక్కడైనా ఏదైనా మస్య ఉంటే తెలియచేయాలని అన్నారు. జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్

మిగతా 2వ పేజీలో..

# మంత్రివర్గ విస్తరణకు అడ్డు రేవంతే

- రాష్ట్రం దివాళా తీసిందన్నా పట్టించుకోని భట్టి
- ఇద్దరి మధ్యా తారాస్థాయిలో విభేదాలు
- బిజెఎల్‌పి నేత ఎలేటి మహేశ్వర రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్- నీలగిరివార్త :మంత్రివర్గ విస్తరణ జరగకుండా అడ్డుకుంటున్నదే సిఎం రేవంత్ రెడ్డి అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొత్త మంత్రివర్గ విస్తరణను అడ్డుకుంటున్న సూత్రధారి, కుట్రదారుడు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం దివాలా తీసిందని సీఎం ప్రకటించినా కూడా.. డిప్యూటీ- సీఎం భట్టి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సీఎం, భట్టికి విభేదాలు ఉన్నాయన్నారు. ఉద్యోగుల విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వర్గంలో విబేధాలు వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రికి మంత్రులు మద్దతుగా లేరన్నారు. రాష్ట్రంలో ఫైనాన్షియల్ ఎమర్జెన్సీని పెట్టి సంక్షేమ పథకాలు, ఉద్యోగుల బకాయిలు ఎగ్గొట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. ఆర్థిక ఎమర్జెన్సీ

మిగతా 2వ పేజీలో..



# సింధూ నదీ జలాల వినియోగం

- భారీ రిజర్వాయర్ల నిర్మాణం
- తక్షణ ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ,:**

సింధు, జీలం, చీనాబ్ నదులపై కొత్తగా డ్యామ్‌లు, భారీ రిజర్వాయర్లు త్వరితగతిన నిర్మించాలని భారత్ భావిస్తోంది. అందుకు అను గుణంగా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు శీఘ్ర ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. పాక్‌కు ఇక్కడి నుంచి చుక్కనీరు కూడా వెళ్లకుండా ఉండేలా వీటిని అమలు చేయబోతున్నారు. ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయిన తర్వాత పాకిస్థాన్‌తో భారత్.. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో



భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సింధు నది, దాని ఉప నదులైన జీలం, చీనాబ్ జల వనరుల్ని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు ఆయా నదులపై కొత్త ప్రాజెక్టుల ప్రణాళిక, అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో

మిగతా 2వ పేజీలో..

# పాక్ దురాగతాలపై విదేశాల్లో ప్రచారం

**పహల్‌గామ్ ఉగ్రదాడిపై ప్రచారంం.. ఎంపిల బృందాన్ని విదేశాలకు పంపే యోచన**

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ సహా ఇప్పటికే అనేక తక్షణ చర్యలు చేపట్టిన భారత్ ఇప్పుడు కొత్త ఇనీషియేటివ్ తీసుకోబోతోంది. ప్రపంచం ముందు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని బట్టబయలు చేయబోతోంది. ఎంపిలను బృందాలుగా చేసి విదేశాల్లో ప్రచారం నిర్వహించాలని చూస్తోంది. ఇందులో శశిథరూర్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ కూడా ఉండనున్నట్లు సమాచారం. పహల్గాంలో 26 మంది ప్రాణాలు బలిగొన్న ఉదంతాన్ని, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి.. ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీ ప్రతినిధుల బృందాన్ని విదేశాలకు పంపనుంది. కశ్మీర్‌పై పాకిస్తాన్ దురాగతాన్ని తిప్పికొట్టడానికి, పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదాన్ని బహిర్గతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యుల ప్రతినిధులను కీలకమైన ప్రపంచ రాజధానులకు పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఉగ్రవాద దాడులపై భారతదేశ దృక్పథాన్ని ప్రదర్శించడం, నిరంతర సీమాంతర ఉగ్రవాద బాధితురాలిగా భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లని ప్రపంచానికి చాటి చెప్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపడతారు. దీంతో ఇప్పుడు.. సరిహద్దుల ఆవల నుంచి పుట్టుకొచ్చే ఉగ్రవాదంపై భారత్ తనవాణిని ప్రపంచ దేశాల ముందు బలంగా వినిపించబోతోంది. ఈ దౌత్య ప్రచారానికి మద్దతు ఇవ్వడానికి విదేశాలలో ఉన్న భారత మిషన్లు పార్లమెంటరీ బృందాలతో కలిసి పని చేస్తాయి. ఈ బృందంలో అధికార బీజేపీ ఎంపీలతో పాటు-, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు ఉండే అవకాశం ఉంది. దీనికి సంబంధించి కేంద్రం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది. భారత్ ఈ తరహా కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి.

# హరీష్ రావు నివాసానికి కెటిఆర్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు- హరీష్ రావుతో సమావేశం అయినట్లు తెలుస్తుంది. తాజా రాజకీయలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు హరీష్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని కూడా కేటీఆర్ అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తుంది. అయితే, మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు ప్రయాణమై వెళ్ళనున్నారు. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమం కోసం ఆమె అమెరికాకు వెళ్తున్నారు. ఇప్పటికే యూఎస్ లో కవిత భర్త అనిల్ ఉన్నారు. ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఇటువంటి సమయంలో కేటీఆర్, హరీశ్ రావు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది. కాగా శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు.

# మంత్రివర్గ విస్తరణకు అడ్డు రేవంతే

మొదటి పేజీ తరువాయి

స్టేట్‌మెంట్‌ను మిగతా మంత్రులు వ్యతిరేకిస్తున్నారని.. మంత్రి మండలి రెండుగా చీలిందంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రికి హైకమాండ్‌కు గ్యాప్ కంటిన్యూ అవుతోందన్నారు. అందుకే మొన్న రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చినా కూడా రేవంత్‌ను పలకరించలేదని తెలిపారు. రేవంత్ వ్యాఖ్యలు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో లేకుండా చేసేలా ఉన్నాయని బహిరంగగానే కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని చెప్పారు. ఫైనాన్సియల్ ఎమర్జెన్సీ పెట్టాలనే ఆలోచనతోనే చీఫ్ సెక్రటరీగా రామకృష్ణ నియామకం జరిగిందన్నారు. మంత్రులకు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. రివ్యూస్ అన్నీ కూడా ముఖ్యమంత్రి నివాసంలో పెట్టడంతో సీనియర్ మంత్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొన్ని శాఖల్లో రేవంత్ జోక్యం చేసుకోవడం మంత్రులకు నచ్చడం లేదని చెప్పుకొచ్చారు. భూముల వ్యవహారంలో సీఎం, రెవెన్యూ మినిస్టర్‌కు గ్యాప్ పెరిగిందని స్పష్టం అవుతోందని ఆయన అన్నారు. మంత్రి వర్గంలో అనుకూలం కంటే వ్యతిరేక మంత్రులే ఎక్కువ అని రేవంత్ భావిస్తున్నారని... అందుకే మంత్రి వర్గ విస్తరణను ముఖ్యమంత్రి ఆపుతున్నారని వ్యాఖ్యలు చేశారు. కేబినెట్ విస్తరణ రేవంత్‌కు ఇష్టం లేదన్నారు. తనకు అనుకూలమైన వారికి మంత్రి పదవులు వచ్చే ఛాన్స్ లేదని.. తన దగ్గరున్న ముఖ్యమైన శాఖలు కొత్త వారికి వెళ్తే .. ఆ శాఖలపై పట్టు పోతుందనే భయం రేవంత్‌కు ఉందని అన్నారు. బీసీలకు పనికి రాని శాఖలు (దేవాదాయ , ఆర్టీసీ) ఇచ్చారని మండిపడ్డారు. మంత్రి పదవులపై ఆశావహులను రెచ్చగొట్టి ముఖ్యమంత్రి రేవంత్ కన్ఫ్యూస్ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి మీద వస్తోన్న అనేక ఆరోపణల ఫైల్ రాహుల్ దగ్గర ఉందంటూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం

మొదటి పేజీ తరువాయి

అయ్యాయని అన్నారు. ఉగ్రవాదులకు ఊతమిస్తే ఇక పాక్ అంతుచూస్తామని ప్రధాని మోదీ హెచ్చరించారని అన్నారు. ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌తో పోరులో భారత సైన్యం చరిత్ర రాసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భాజపా నిర్వహించే తిరంగా యాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అంబేడ్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇది సైనికులకు ఆత్మస్థయిర్యం నింపేలా, వారికి మద్దతుగా చేస్తున్నదని అన్నారు. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. ఇకపోతే ఈ దాడితో భారత సైనికపాటవాన్ని ప్రపంచం గుర్తించిందని అన్నారు.

# వందలాది మంది మావోలను హత్య చేస్తున్నారు

**ఆపరేషన్ కగార్ సరికాదన్న చాడ**

**సిద్దిపేట :** ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి, ఉగ్రవాదులను అంతం చేయడం ప్రపంచశాంతికి శుభ పరిణామం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నక్సలైట్లు శాంతి చర్చలకు సిద్ధమన్న చర్చించకుండా కక్ష ధోరణి వైఖరితో కేంద్ర ప్రభుత్వం, అమిత్‌షా వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణం అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో సీపీఐ మండల మహాసభలు జరుగు తున్నాయి. ఈ వేడుకలకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వందల మంది మావోయిస్టులను చంపడం రాజ్యాంగ విరుద్ధం.. అమిత్ షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.. వామపక్ష పార్టీలన్నీ ఖగర్ ఆపరేషన్ ను తీవ్రంగా ఖండిస్తున్నాయి.. నక్సలైట్లతో ప్రధాని మోడీ, అమిత్ షా శాంతి చర్చలకు సిద్ధం కావాలి అని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే, కొత్త ఆసుపత్రి నిర్మాణం పేరుతో ఇప్పుడు కొనసాగుతున్న హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రి భవనాన్ని కూల్చివేయద్దు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంత వరప్రదాయాన్ని గౌరవెల్లి ప్రాజెక్టును గత బీఆర్ఎస్ కాలంలో కేసీఆర్ పూర్తి చేయలేదని ఆరోపించారు.ఇప్పుడు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా రెండేళ్లు గడుస్తున్నప్పటికీ 437 కోట్ల రూపాయలు తీసుకువచ్చాను అంటున్నాడు కానీ ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తి కావడం లేదని విమర్శలు గుప్పించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయాలనే డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని చాడ పేర్కొన్నారు.

# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదుల హతం

**ప్రకటించిన భారత బలగాలు**

**శ్రీనగర్- నీలగిరివార్త :** జమ్మూ కశ్మీర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులను ఇండియన్ ఆర్మీ మట్టుబెట్టింది. నిఘా వర్గాల సమాచారంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టామని, 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు- ఫోర్స్ మేజర్ జనరల్ ధనంజయ్ జోషి తెలిపారు. గత మార్చిలో జరిగిన ఓ హత్యలో ఈ ఆరుగురు ఉగ్రవాదుల్లో ఒకరి ప్రమేయం ఉందని తెలిపారు.

# పాక్‌తో దూరంగా తాలిబన్ ప్రభుత్వం

- జైశంకర్‌తో విదేశాంగ మంత్రి చర్చలు
- కలిసివస్తున్న అంతర్జాతీయ పరిణామాలు

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :**

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సంచలన ఆరోపణలు చేసింది. భారత్ ప్రయోగించిన ఓ క్షిపణి అఫ్గాన్ భూభాగంలో పడినట్లు తప్పుడు ప్రచారం చేసింది. దీన్ని కాబూల్ ఖండించింది. తమకు ఎలాంటి హాని జరగలేదని, అదంతా అవాస్తవమేనని తాలిబన్ రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. అటు న్యూదిల్లీ కూడా పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టింది. ఈక్రమంలో తాజాగా అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో.. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని తాలిబన్లు ఖండించడాన్ని జైశంకర్ స్వాగతించారు. ఈవిషయాన్ని కేంద్రమంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తాలిబన్ ప్రభుత్వంతో న్యూదిల్లీ మంత్రిత్వ స్థాయి చర్చలు జరపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్‌తో మంచి సంభాషణ జరిగింది. పహల్గాం ఉగ్రదాడిని ఆయన ఖండించడం హర్షణీయం. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య విభేదాలు సృష్టించేందుకు ఇటీవల అవాస్తవ, నిరాధార ప్రచారం జరిగింది. దాన్ని ఆయన తోసిపుచ్చడాన్ని స్వాగతిస్తున్నా. అఫ్గాన్ ప్రజలతో మా స్నేహబంధాన్ని కొనసాగిస్తాం. వారి అభివృద్ధికి నిరంతర మద్దతు అందిస్తాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశంపై మేం చర్చలు జరిపామని జైశంకర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2021 ఆగస్టులో అఫ్గాన్‌లో తాలిబన్ పాలన ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ దౌత్య సంబంధాలు మాత్రం కొనసాగిస్తోంది. ఈ ఏడాది జనవరిలో దుబాయ్ వేదికగా ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. మరోవైపు, అఫ్గాన్‌లో అల్‌ఖైదా, ఐసిస్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ వంటి ఉగ్రముఠాల ఉనికిపై న్యూదిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చలు జరపడం తాజా పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. పాక్ ఒంటరి అయ్యిందనడానికి ఇది కూడా కీలక పరిణామంగా చూడాలి.



# మరింత ఆయుధ సంపత్తి!

మొదటి పేజీ తరువాయి

అని ప్రతీ భారత పౌరుడితో పాటు ప్రపంచం మొత్తం ఎంతో ఆత్రుతగా ఎదురు చూసింది. ఎవ్వరూ ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి మరీ ఇండియన్ ఆర్మీ ఉగ్రవాదులపై దాడులు చేసింది. వంద మంది ఉగ్రవాదులు ఈ దాడుల్లో చనిపోయారు. తర్వాత రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధంలో కూడా భారత్ తన సత్తా ఏంటో చూపించింది. పాకిస్తాన్‌లోని ఏయిర్‌బేస్‌లు, ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది. 2025.. 2026 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం రక్షణ శాఖకు 6.81 లక్షల కోట్లను కేటాయించింది. గత సంవత్సరంకంటే ఇది చాలా ఎక్కువ. 2024.. 2025 సంవత్సరానికి గానూ కేంద్రం 6.22 కోట్లను కేటాయించింది. 2025..2026 సంవత్సరానికి ఆ నిధుల్ని 9.2 శాతం పెంచేసింది. వచ్చే బడ్జెట్.. అంటే 2026, 2027 సంవత్సరానికి గాను 6.81 లక్షల కోట్లకు మరో 50 వేల కోట్లు వచ్చి చేరే అవకాశం ఉంది. మొత్తంగా రక్షణ శాఖ బడ్జెట్ ఏకంగా 7 లక్షల కోట్లకు పైకే చేరుతుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందనుంది. ఏడు లక్షల కోట్ల బడ్జెట్ మొత్తాన్ని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఆయుధాల కొనుగోళ్లు, ఇతర అవసరమైన వస్తువుల కొనుగోలుకు వాడనున్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రక్షణ శాఖపై ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే ఏకంగా రూ. 2.29 లక్షల కోట్లను కేటాయించారు. చైనా, పాకిస్థాన్ నుంచి భద్రతా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. రూ.50వేల కోట్ల అనుబంధ బడ్జెట్‌లో నిధులను పరిశోధన, ఆయుధాలు, అవసరమైన పరికరాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశాలున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిఫెన్స్ కేటాయింపులు రూ.2.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం వార్షిక పద్దులో 13 శాతం రక్షణకే కేటాయించారు.

# కావాలంటే అసలు సినిమా చూపిస్తాం

మొదటి పేజీ తరువాయి

ఏయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. భారత్ యుద్ధ నియమాలు, టెక్నాలజీ మారిందని ప్రపంచానికి మీరు చాటి చెప్పారు. ధైర్య, సాహసాలకు ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ ప్రతీకగా నిలిచింది. ఏయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌కు నా కృతజ్ఞతలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు.గురువారం జమ్మూకాశ్మీర్ పర్యటనలో భాగంగా పాకిస్తాన్‌పై ఫైర్ అయ్యారు. పాకిస్తాన్ దగ్గర ఉన్న అణు బాంబులను లాక్కోవాలని ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి..పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ సైనికులతో సమావేశమైన కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి వచ్చిన నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలో ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తుందన్నారు. అప్పు చేసి మరీ దాయాది దేశం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టు-కొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని కోరారు. భవిష్యత్తులోనూ ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించొద్దని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు భారత్ అర్ధరాత్రి ఉదయపు వెలుగు ఎలా ఉంటు-ందో చూపించిందని.. మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ఈ ఆపరేషన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణి శక్తిని దాయాది దేశం కూడా అంగీకరించిందని పేర్కొన్నారు. భుజ్ వైమానిక స్థావరం అనేక పాకిస్థాన్ డ్రోన్‌లను కూల్చడాన్ని ప్రస్తావిస్తూ..సైన్యాన్ని ప్రశంసించారు. 1965లోనూ పాకిస్థాన్‌పై మన విజయానికి భుజ్ సాక్షిగా నిలిచిందని గుర్తు చేశారు. ఇదిలావుంటే ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) ఆ దేశానికి మంజూరయ్యాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు- ప్రకటించారు. భారత్ చేసిన వైమానిక దాడుల్లో 14 మంది మసూద్ కుటు-ంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని ఆ దేశ ప్రధాని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేవలం మసూద్ కుటు-ంబానికి రూ.14 కోట్లు- చెల్లించే అవకాశం ఉంది. అదనంగా భారత్ దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను పునర్నిర్మిస్తామని పాక్ ప్రధాని హామీ ఇచ్చారు.

# మంత్రి కొండా సురేఖ నిజాలు మాట్లాడారు

మొదటి పేజీ తరువాయి

కమిషన్ లేకుండా ఫైళ్లపై మంత్రులు సంతకాలు పెట్టరని వారి సహచర మంత్రులే చెబుతున్నారని, సచివాలయం లోపల కాంట్రాక్టర్లు ధర్నాలు చేయడం చూస్తే, ఈ వ్యవస్థలో కమిషన్ వ్యవహారం ఎంత లోతుగా ఉందో స్పష్టమవుతోందన్నారు. మంత్రుల పేర్లను బహిర్గతం చేసి ప్రజలకు సత్యం చెప్పాలని కొండా సురేఖని కోరుతున్నానని, రేవంత్ రెడ్డి లేదా రాహుల్ గాంధీ, ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా? అంటూ కేటీఆర్ విమర్శల వర్షం కురిపించారు. అయితే దీనిపై కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పుగా ప్రచారం చేస్తోందని, తన మాటల ఉద్దేశం గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులపైనేనని స్పష్టం చేశారు. పనులకు అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు అన్నదే నా మాట. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలపై ఎలాంటి విమర్శలు చేయలేదంటూ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారానికి తావు ఇవ్వడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. 'క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం' అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది.దతన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పని-కై-నా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

# తీగ లాగారు డొంక కదిలింది

మొదటి పేజీ తరువాయి

అతను చిన్న కార్లను అమ్మేవాడు, కానీ తర్వాత బషారత్ ఖరీదైన కార్లను అమ్మడం ప్రారంభించాడు. ఈ కార్లను షోరూమ్‌లో ప్రదర్శనకు ఉంచారు. అనేక వాహనాలను వీఐపీలకు అమ్మారు. కార్లను రాజకీయ నాయకులు ఉపయోగించడానికి అద్దెకు కూడా ఇచ్చారు. కొంతమంది పార్లమెంటు సభ్యులతో బషారత్?కు మంచి సంబంధాలున్నాయని అతని సన్నిహితుల్లో ఒకరు చెప్పారు.

**సాధారణ జీవితంనుంచి బడా వ్యాపారవేత్తగా**

సాధారణ జీవితం నుంచి బడా వ్యాపారవేత్తగా నాంపల్లిలోని విజయ్ నగర్ కాలనీలో సాధారణ జీవితం ప్రారంభించిన బషారత్, రాజకీయ నాయకుల్లోని తన నెట్‌వర్క్ ద్వారా వేగంగా ఎదిగారు. ఢిల్లీ నుంచి వచ్చిన రాజకీయ నాయకులకు హై ప్రొఫైల్ పార్టీలను నిర్వహించడంలో ప్రసిద్ధి చెందారు. ఇక పన్నులు ఎగవేసేందుకు కస్టమర్లు బషారత్ కు నగదు రూపంలో చెల్లింపులు జరిపేవారని తెలుస్తోంది.అంతేకాకుండా బషారత్ భాగస్వామి డాక్టర్ అహ్మద్, మరో ఇద్దరికీ సంస్థ లో భాగస్వామ్యం ఉంది. పన్నులు చెల్లించకుండా ఉండటానికి బ్లాక్ మనీని వైట్?గా మార్చడానికి కూడా అతనికస్టమర్లలో చాలామంది నగదు ద్వారా కార్ల ను కొనుగోలు చేసినట్టు తెలుస్తోంది. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తన తెలివితేటల కారణంగా త్వరగానే ధనవంతుడయ్యారని ప్రచారం. మోసం ఎలా జరిగిందంటే అమెరికా, జపాన్ నుంచి కొనుగోలు చేసినవాహనాల్ని మొదట దుబాయ్ లేదా శ్రీలంకకు ఎడమచేతి డ్రైవ్ నుంచి కుడి చేతి డ్రైవ్(ఆర్ హెచ్ డీ)కు మార్చేవారు. ఈ మార్పుల తర్వాత వాహనాల విలువను గణనీయంగా తగ్గించే పత్రాలను ఉపయోగించి కార్లను భారతదేశంలోకి దిగుమతి చేసుకున్నారు. దీంతో గణనీయమైన కస్టమ్స్ సుంకాలను ఎగవేశారనే అభియోగాలున్నాయి.అన్నీ హైఎండ్ లగ్జరీ కార్లే! ఖరీదైన కార్లలో హమ్మర్ ఈవీ, కాడిలాక్ ఎస్కలేడ్, రోల్స్ రాయిస్, లెక్సస్, టయోటా ల్యాండ్ క్రూయిజర్, లింకన్ నావిగేటర్ వంటి ప్రీమియం మోడళ్లతో సహా 30కి పైగా లగ్జరీ వాహనాలను ఈ పద్ధతిని ఉపయోగించి దేశంలోకి తీసుకు వచ్చారని దర్యాప్తులో తేలింది. హైదరాబాద్,ముంబై, పూణే, అహ్మదాబాద్, బెంగుళూరు, ఢిల్లీతో సహా ప్రధాన నగరాల్లో ఆ కార్లను అమ్మేశారు. ఇట్లా సుంకం ఎగవేత అంచనా దాదాపు రు. 25 కోట్లు దాటిందని తెలుస్తోంది.

**కీలక దిగుమతిదారుల్లో ఒకరి అరెస్టుతో బషారత్**

**దొరికాడిలా!**

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కీలక దిగుమతిదారుల్లో ఒకరిని డీఆర్ఐ అరెస్టు చేసింది. అతను అలాంటి ఎనిమిది లగ్జరీ వాహనాల్ని దిగుమతి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.దీనిఫలితంగా రు.7 కోట్లకు పైగా కస్టమ్స్ సుంకం ఎగవేత జరిగింది. అహ్మదాబాద్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ (సీజేఎం) కోర్టు అతన్ని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఈ మోసపూరిత దిగుమతులకు దోహదపడ్డారని వాటి నుంచి ప్రయోజనం పొందారని అనుమానాలున్న ఇతర దిగుమతి దారులపై డీఆర్ఐ దర్యాప్తు కొనసాగిస్తోంది. బషారత్? నుంచి కొనుగోలు చేసిందెవరు? ఈ క్రమంలో బషారత్ నుంచి 10 కార్లు కొనుగోలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయి.

**బషారత్ నుంచి కార్లను కొనుగోలు చేసిందెవరు?**

ఈ కస్టమర్లను గుర్తించడానికి డీఆర్ఐ వెతుకుతోంది. బషారత్ యాజమాన్యంలోని షోరూమ్‌లో షోరూమ్ వెనుక ఒక ఇన్-హౌస్ వర్క్‌షాప్ ఉంది. అక్కడ అనేక కార్లకు సంబంధించిన ఉపకరణాలు లభించడమే కాకుండా,మోడిఫికేషన్ లు కూడా చేస్తుంటారని డీఆర్ఐ గుర్తించింది.

# పాపం నిరుద్యోగులు!

మొదటి పేజీ తరువాయి

మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఫ్యూ రోపాల్ క్రియేషన్, ఐటీ సొల్యూ షన్స్ కంపెనీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసాలకు పాల్పడింది. నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి ఆపై ఉద్యోగాలు ఇస్తామంటూ వలవేసింది కంపెనీ. బాధితుల నుండి విడతల వారీగా ఒక్కొక్కరి నుంచి 2 నుండి రెండున్నర లక్షల రూపాయల వరకూ వసూలు చేశారు నిర్వాహకులు. వీరి మాటలు నమ్మి దాదాపు 200 మంది యువకులు డబ్బులు కట్టి కంపెనీలో చేరారు. అయితే కొంతమందికి వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ నమ్మించింది కంపెనీ యజమాన్యం. చివరకు ట్రైనింగ్ ముగించిన తర్వాత కూడా ఎటువంటి ఉద్యోగం ఇవ్వకుండా కాలం గడుపుతూ వచ్చింది యాజమాన్యం. దీంతో అనుమానం వచ్చిన అభ్యర్థులు గచ్చిబౌలి వచ్చి చూడగా అక్కడ ఎలాంటి ఆఫీసు కనిపించలేదు. దీంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కంపెనీ బోర్డు తిప్పేయడంతో రోడ్డున పడ్డామని చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరారు.

# మరింత కరెంట్!

మొదటి పేజీ తరువాయి

అవసరాలను లెక్కలోకి తీసుకోవాలి.. కొత్తగా ఏర్పాటు- చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ ను దృష్టిలో పెట్టు-కుని ముందుకు కొనసాగాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్ గా మారబోతుంది.. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నా మని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైనా దృష్టి సారించాలి.. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు- చేయాలని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు- చేయాలని సూచించారు. అలాగే, సెక్రటె-రియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు లాంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను అందుబాటులోకి తీసుకు రావాలని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఖర్గేను ప్రధానిని చేస్తామనగలరా

మొదటి పేజీ తరువాయి

కూడా రేవంత్ రెడ్డి ఎప్పుడో దాటిపోయారని.. చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కొప్పుల ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. పాలన చేతగాక పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీల నాయకత్వం అనేది వాటి అంతర్గత వ్యవహారమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా మమ్మల్ని అడిగి చేశారా అని నిలదీశారు. ఆయన్ను ఎందుకు పీసీసీ అధ్యక్షుడిని చేశారు.. ఆ పదవి దళితుడికి ఎందుకు ఇవ్వలేదని మేమైనా అడిగామా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేసే పార్టీ అని.. ఎవరైతే తెలంగాణ ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకుంటు-ందని స్పష్టం చేశారు. 2014కి ముందు దళిత ముఖ్యమంత్రి అని అన్నారని.. అప్పటికీ మేం అధికారంలోకి రాలేదని.. విజయ రామారావును బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా నియమించారని గుర్తుచేశారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్నిఅభివృద్ధి చేసే విజన్‌ను సిద్ధం చేసుకున్న కేసీఆర్ సీఎం అయితేనే మంచిది అనుకుని పార్టీ తెలంగాణ ముక్త కంఠంతో నిర్ణయం తీసుకుందని తెలిపారు. అందుకే దళితుడు సీఎం కాలేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగా వచ్చిన రాష్ట్రం కనుక కేసీఆర్ తప్ప ఎవ్వరు సీఎం అయినా రాష్ట్రానికి నష్టం జరిగేదని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయినంక రాష్ట్ర పరిస్థితి ఏమైందో చూస్తునే ఉన్నామని అన్నారు. ఖర్గే ఏఐసీసీ డమ్మీ అధ్యక్షుడు అని.. నడిపేదంతా రాహుల్ గాంధీ అని జనానికి తెలియదా అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ జపం తప్ప ఇంకేమైనా ఉందా అని ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంకలకు ఏ హోదా ఉన్నదని గత ఎన్నికల్లో డిక్లరేషన్లను వారితో రేవంత్ రెడ్డి ప్రకటింపజేశారని అడిగారు. హామీల అమలుకు తమది గ్యారంటీ అని వాళ్ళు ఎలా చెప్పారని కొప్పుల ప్రశ్నించారు.

# సింధూ నదీ జలాల వినియోగం

మొదటి పేజీ తరువాయి

భాగంగా రణబీర్ కాలువను విస్తరించే ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నట్టు-సమాచారం. ఇది భారత్ చేపట్టాలని భావిస్తోన్న కీలక ప్రణాళికలలో ఒకటి. రణబీర్ కాలువ పొడవును 120 కి.మీ.కు రెట్టింపు చేయాలని, తద్వారా సెకనుకు 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కలుగుతుందని అంటు-న్నారు. ప్రస్తుతం దీని సామర్థం 40 క్యూబిక్ మీటర్లు. దీంతోపాటు-, సింధు, చీనాబ్, జీలం నదుల నుండి నీటిని మూడు ఉత్తర భారత రాష్ట్రాలలోని నదుల్లోకి తరలించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు- రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. ప్రస్తుతం సింధు దాని ఉప నదులపై ఉన్న చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 3,360 మెగావాట్ల నుండి 12,000 మెగావాట్లకు పెంచాలని భావిస్తున్నట్టు- చెబుతున్నారు. కొత్తగా భారత్ ఈ నదులపై కనీసం ఐదు నీటి నిల్వ ప్రాజెక్టులను గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం ఉపనదులపై ఉన్నాయని తెలిపింది. కాగా, పాకిస్తాన్‌లోని దాదాపు 80 శాతంపొలాలకి, అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా సింధు నీటి ప్రవాహంపై ఆధారపడి ఉన్నాయి. పాకిస్తాన్ తో భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత మే ప్రారంభంలో పాకిస్తాన్‌లోని కీలకమైన ప్రాజెక్టుల్లో నీరు 90శాతం వరకు తగ్గిందిని చెబుతున్నారు. సింధునది టిబెట్‌లోని మానసరోవర్ దగ్గర ఉద్భవించి, అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది భారత్ లోని ఉత్తర, పాకిస్తాన్ లోని తూర్పు, ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రవహిస్తుంది.

# ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు- పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUBLICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY
neelagirivartha@gmail.com

# నీలగిరి వార్త

తెలుగు దిన పత్రిక
మన కోసం మన వార్త



తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
శనివారం
17-5-2025


## గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో జోరుగా వరి ధాన్యం కొనుగోళ్లు

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌లి**

**రాష్ట్రం లో తృతీయ స్థానం**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

జిల్లాలో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు జోరుగా కొనసాగుతున్నదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 446 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వార ఇప్పటి వరకు 62830 మంది రైతుల నుండి 776 కోట్ల విలువైన 3.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ తో రాష్ట్రం లో కామారెడ్డి జిల్లా తృతీయ స్థానం లో నిలిచిందనీ తెలిపారు. దీంట్లో 1.62 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1.73 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని. ఇప్పటి వరకు 44495 మంది రైతులకు గాను 660 కోట్ల వరకు డబ్బులు చెల్లింపులు కూడా పూర్తయ్యాయనీ తెలిపారు. గతేడాది పోలిస్తే అనగా రబీ 2023-24 ఇదే సమయానికి 50040 రైతుల నుండి 2.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగా, అదేవిధంగా ఆ క్రిందటి ఏడాది అనగా రబీ 2022-23 సీజన్ లో 30264 రైతుల వద్ద నుంచి 1.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ను కొనుగోలు చేశామన్నారు.

గత రెండు సీజన్ లతో పోలిస్తే ఈ రబీ సీజన్ లో ధాన్యం కొనుగోళ్ళు, రైతులకు చెల్లింపులు 40% అధికంగా చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు సన్న రకం ధాన్యం అమ్మిన 18570 మంది రైతులకు బోనస్ చెల్లింపులకు రూ.73.96 కోట్లు ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాలను దృష్టి లో ఉంచుకొని కేంద్రాలలో తగినన్ని టార్పాలిన్ లను ఏర్పాటు చేయాలనీ మార్కెటింగ్ శాఖ వారికి సూచించారు. అలాగే రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే క్రమములో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## దాతృత్వం చాటుకున్న ఎంపీ రవిచంద్ర

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



గల్ఫ్ లో మృతి చెందిన నిరుపేద నల్గొండ వాసి, సొంత ఖర్చులతో మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించి దయాగుణం చాటిన ఎంపీ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన విశాల హృదయాన్ని దయాగుణాన్ని, దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. బతుకుదెరువు కోసం పొట్ట చేతబట్టుకుని ఉన్న ఊరు వదిలి గల్ఫ్ బాట పట్టిన నల్లగొండ జిల్లాకు చెందిన ఒక వ్యక్తి అక్కడ అకాల మృత్యువుకు లోనయ్యారు.అతని మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చే స్థోమత లేక కుటుంబ సభ్యులు ఎంపీ రవిచంద్రను సంప్రదించడంతో ఆయన వెంటనే స్పందించి అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.మరిన్ని వివరాల్లోకి వెళితే... నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన శ్రీరాములు బతుకుదెరువు కోసం సౌదీ అరేబియా వెళ్లారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన రియాద్ లోని ఒక ఆస్పత్రిలో చేరి వైద్య సేవలు పొందుతూనే తుది శ్వాస విడిచారు విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో శ్రీరాములు మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించడం ఎలాగో,ఎవరిని కలవాలో,అందుకు ఎంత ఖర్చవుతుందో తెలియక, ఆర్థిక స్థోమత లేక దిక్కుతోచని పరిస్థితుల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకుల సాయంతో ఎంపీ వద్దిరాజు రవిచంద్రను సంప్రదించడం జరిగింది.ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి వారిని ఓదార్చి మనోధైర్యాన్నిస్తూ, అందుకు అవసరమైన అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ తగు ఏర్పాట్లు చేశారు.ఇందుకు గాను ఖర్చైన సుమారు 3 లక్షలు రూపాయలను ఎంపీ రవిచంద్ర భరించారు.దీంతో మృతదేహం విమానంలో హైదరాబాద్ ,ఆ తర్వాత బుధవారం రాత్రి స్వస్థలం వెలిమినేడు చేరింది.శ్రీరాములు కుటుంబ, సభ్యులు, బంధు మిత్రులు,స్థానికులు ఎంపీ వద్దిరాజుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## వరంగల్ వ్యవసాయ మార్కెట్లో ఎండ తట్టుకోలేక మరణించిన హమాలీ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం.

**వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

శుక్రవారం రోజున ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో హమాలి కార్మికునిగా పనిచేస్తున్న శ్రీ శివరాత్రి శీను ఎండల తీవ్రతను తట్టుకోలేక విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అతని సేవలను స్మరిస్తూ దివి 13-05-2025 మంగళవారం రోజున నిర్వహించిన శ్రద్ధాంజలి సమావేశంలో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి అతనికి 11,000 రూపాయల ఆర్థిక సహాయం చాంబర్ తరపున చేస్తామని హామీ ఇవ్వడం జరిగినది. ఈ హామీ మేరకు ఈరోజు అనగా శుక్రవారం రోజున అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఛాంబర్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినందున వ్యవసాయ మార్కెట్ నుండి చట్ట పరంగా అతనికి రావాల్సిన పరిహారములను అందించి వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వ్యవసాయ మార్కెట్ అధికారులను లేఖ ద్వారా కోరినారు. అంతేగాక ఇలాంటి అత్యవసర పరిస్థితులలో తగిన వైద్య సహాయం అందించుటకు వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్సకై వసతులు చేశారని ఇంకా కొన్ని అత్యవసర వసతులు కల్పించాలని మార్కెట్ అధికారులకు లేఖ ద్వారా కోరినామని తెలియజేసినారు. మరియు ఇంకా మెరుగైన వైద్య చికిత్స కొరకు అందుబాటులో గల ఎంజిఎం గానీ ఇతర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో చికిత్స పొందుటకు కార్మికులకు తగిన సహాయ సహకారాలు అందించుటకు చాంబర్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేసినారు. అంతియేగాక వ్యవసాయ మార్కెట్లో పనిచేసే కార్మికులందరూ లేబర్ ఇన్సూరెన్స్ తప్పక చేసుకోవాలని సూచించినారు. ఇట్టి ఆర్థిక సాయం అందించే కార్యక్రమమునకు చాంబర్ కోశాధికారి అల్లే సంపత్ , సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్ గారు, అడ్తి సెక్షన్ అధ్యక్షులు ఎన్ రెడ్డి లింగారెడ్డి , ఉపాధ్యక్షులు సూర రమేష్ , చిల్లీస్ సెక్షన్ కార్యదర్శి లోలాకపురి సురేందర్ , గుమస్తా సంఘం అధ్యక్షులు ఇనుముల మల్లేశం , కార్యదర్శి సులగం గోపాల్ , వివిధ హమాలీ కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు వివిధ సెక్షన్ల గౌరవ సభ్యులు పాల్గొనడం జరిగినది.

## దళిత మహిళల ఆత్మగౌరవ ఘటన పై స్పందించిన ఎస్పీ

- దళితుల ఇంటికీ తాళాలు " ఘటన " పై స్పందించిన "పోలీస్ యంత్రాంగం..!
- అగ్రవర్ణాలకు - దళిత కుటుంబ ఆర్థిక తగదాలతో ఇంటికీ తాళం వేసిన వైనం..?
- గ్రామంలో లా ఆండ్ ఆర్డర్‌తో అదుపులోకి తీసుకున్న యర్రగొండపాలెం పోలీసులు..!
- దళిత కుటుంబాన్నికీ అండగా నిల్చున్న " విశ్రాంత అడిషినల్ డి.జి.పి.బాబురావు...
- ముఖ్య భూమిక పోషించిన పీ.ఏ.యఫ్ వ్యవస్థాపకులు " పులుగుజ్జు.సురేష్ "...
- సుదీర్ఘంగా శ్రమించిన సి.ఐ.ప్రభాకరరావు,యస్ .ఐ చౌడయ్య...
- స్పందించిన యస్ సి,యస్ .టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నాయకులు బూదాల గురవయ్య, ఆదిమూలపు అనిల్ రాజు లూకా ...



బ్యూరో ఇంచార్జ్ (కంచర్ల నాగేశ్వరరావు గౌడ్) : నీలగిరి వార్త

దళితుల ఇంటికి తాళాలు వేసిన అగ్రవర్ణాల అధిపత్యం అనే ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకెళ్తే ప్రకాశంజిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో గల సర్వయపాలెం గ్రామంలో గల దళితవాడలో మురికిపూడి దేవకరుణ,విక్టోరియా అని ఇద్దరు ఒకే ఇంటి కోడలు.ఈనెల 13వ తేదీన సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇద్దరు కోడళ్ళు ఇంట్లో పిల్లలకు అన్నం తినిపించుకుంటూ, టీవీ చూస్తున్న సమయంలో ఒక్కసారిగా అదే గ్రామానికి చెందిన నలుగురు అగ్రవర్ణాల వ్యక్తులు మూకుమ్మడిగా కర్రలతో ఇంట్లోనే సామాగ్రిని,అడ్డు వచ్చిన మహిళల పై కూడా దాడులకు తెగబడ్డారు. అంతటి తాగకుండా ఇంట్లో భయాందోళనకు గురైన దళిత బిడ్డలను బయటకు లాక్కొచ్చి మరి దళితుల ఇంటికి అగ్రవర్ణాల వారే తాళాలు వేసిన దుర్ఘటన చోటు చేసుకోవడంతో అదే సమయానికి ఈ యొక్క దళిత కుటుంబంలో మగవారు లేకపోవడంతో దళిత ఆడబిడ్డలు భయంతో వణుకుతూ పక్క ఊర్లో బంధువుల వద్దకు పరుగులు తీశారు.ఈ ఉదంతానికి అసలు కారణం.గతంలో జరిగిన ఆర్థిక అపరమైన విషయాలే కారణంగా తెలుస్తుంది.ఏది ఏమైనాప్పటికీ దళిత బిడ్డల బంధువులు,కుల పెద్దలు స్థానిక అగ్రవర్ణాల వద్దకు స్వయంగా వెళ్లి సద్ది చెప్పినప్పటికీ ఇంటికి వేసిన తాళాలు తీయడం జరగదని తెగేసి చెప్పడంతో.. ఏమి చేయాలో అర్థం కాక..ఇలా మూడు రోజులు గడిచినప్పటికీ చివరికి దళితుల ఇంటికి తాళాల ఘటన సివిల్ రైట్స్ ఇంట్రాక్టివ్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షులు విశ్రాంత అదనపు డీజీపీ కే బాబురావు వద్దకు ఈ యొక్క దుర్ఘటనలను పీపుల్స్ యాక్షన్ ఫోరం ఆఫ్ ఇండియా " పులుగుజ్జు.సురేష్ " ద్వారా సమాచారం చేర్చడంతో తక్షణమే స్పందించిన విశ్రాంత అదనపు డీజీపీ కే బాబురావు ప్రకాశం జిల్లా యస్ .పి ఏ.ఆర్ .దామోదర్ కు హుటాహుటిన చరవాణి ద్వారా సంబంధిత పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు, ఎర్రగొండ పాలెం సీ.ఐ.ప్రభాకరరావు,ఎస్సై చౌడయ్య లు సంఘటన స్థలానికి చేరుకొని పునర్ పరిశీలించి గ్రామంలోని అగ్రవర్ణాల వ్యక్తులతో దళిత వాడలోని దళితుల కుటుంబాల పెద్దలతో సుదీర్ఘంగా మాట్లాడి అవసరమైన రీతిలో కౌన్సిలింగ్ ఇచ్చి జఠినమైన గ్రామ సమస్యను ఎంతో చాకచక్యంగా సర్దుబాటు చేసి లా అండ్ ఆర్డర్ పై గౌరవాన్ని పెంచారు.ఈ ఘటన పై చరవాణి ద్వారా నీలగిరి వార్త జిల్లా బ్యూరో కంచర్ల నాగేశ్వరరావు గౌడ్ విశ్రాంత అదనపు డీజీపీ కే బాబురావుతో తీసుకున్న వివరాల నేపథ్యంలో ఆయన మాట్లాడిన వైనంలో భారతదేశంలో దళితుల పై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు, అలాగే మహిళలకు రక్షణ కరువైందన్నారు.ఇప్పటికైనా దళితవాడల్లో పిల్లలను చదువుల పట్ల ఆసక్తి కనపరిచేలా చదివిస్తే చదువు అనేది దళిత బిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెడుతుందంటూ ఆయన ఘంటా పదంగా తెలిపారు.స్పందించిన ప్రతి ఒక్కరికి బాధిత దళిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.

## శాంతి భద్రతల పరిరక్షణలో డయల్ - 100 సేవలు కీలకం

**జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

- డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలి.
- సంఘటన స్థలాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలి.
- లిబాధితుల సమస్యలను పరిష్కరించే దిశగా విచారణ చేపట్టాలి.

జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం రోజున డయల్ 100 సేవల నిర్వహణ పై బ్లూ కోట్స్, పెట్రో కార్స్ పోలీసు సిబంధితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం లో లిజిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పాల్గొని సిబ్బందికి డయల్ 100 కాల్స్ వచ్చినప్పుడు ఏమైనా సమస్యలు వస్తున్నాయా, ఏలాంటి కాల్స్ ఎక్కువగా వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 కాల్స్ వచ్చినప్పుడు సంబంధిత స్థలానికి త్వరగా చేరుకోవాలని ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... శాంతి భద్రతలు పరిరక్షించడంలో బ్లూ కోట్స్, పెట్రో కార్స్ సిబ్బంది సేవలు ఎంతో కీలకం అని ఎస్పీ తెలిపారు. డయల్ 100 కాల్స్ వచ్చినపుడు పోలీసు సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి






సంఘటన స్థలాన్ని చేరుకోవడం ద్వారా నేరం యొక్క తీవ్రతను వీలైనంతవరకు తగ్గించవచ్చని తెలియజేశారు. ముఖ్యంగా డయల్ 100 కాల్ వచ్చినప్పటినుండి త్వరగా సంఘటన స్థలాలకు చేరుకునేంతవరకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్ హెచ్ఓకి సమాచారం ఇవ్వాలని సూచిం చారు. సంఘటన స్థలానికి చేరుకున్న తర్వాత బాధితులకు న్యాయం చేకూరే విధంగా విచారణ చేపట్టాలని, సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలి.

జన సామర్థ్యం గల ప్రదేశాలలో విసిబుల్ పోలీసింగ్ ఉండాలని, విధుల్లో ఉన్నవారు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పాయింట్ బుక్స్ విధిగా తనిఖీ చేయాలని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్ లను ప్రతిరోజు తనిఖీ నిర్వహించాలని సూచించారు. డయల్ 100 కు వినియోగించే టాబ్ లను జాగ్రత్తగా వినియోగించి 24 గంటలు నెట్వర్క్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి అని తెలిపారు. సిబ్బందికి ఉద్యోగపరంగా ఎటువంటి సమస్యలున్న నేరుగా సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద సీఐ నరేష్, డయల్ 100 పెట్రో కార్స్, బ్లూ కోర్ట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సిపి

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం వెస్ట్‌జోన్ పరిధిలోని చిల్పూర్, తరిగొప్పుల, నర్మెట్ట ,జనగామ పోలీస్ స్టేషన్లతో పాటు వెస్ట్ జోన్ డిసిపి కార్యాలయమును సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలు సూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ





ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని. ట్రై సిటి పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు.సమావేశ ప్రాంగణాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ జనగామ ఏసిపి కార్యాలయములో నూతనంగా నిర్మించిన వెస్ట్ పోలీస్ అధికారుల సమావేశ ప్రాంగణాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రారంభించారు. అనంతరం ఈ సమావేశ ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ పండ్ల మొక్కలను నాటారు. పోలీస్ కమిషనర్ వెంట డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఏఎస్పీ చైతన్య నితిన్, ఏసిపిలు భీం శర్మ,నర్సయ్య ఇన్స్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

## త్వరితగతిన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయండి

**బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే**

**రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతి పై సమీక్షా సమావేశం**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

త్వరితగతిన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయం లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతి పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతం గా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు.ఈ



సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలని అనంతరం బ్యాంకులకు లోన్ పరిశీలన నిమిత్తం పంపించడం జరుగుతుందని అట్టి పరిశీలన తదుపరి కమిటీ ఆధ్వర్యంలో సెలక్షన్ లిస్ట్ తయారుచేసి అట్టి జాబితాను కలెక్టర్‌కు మంజూరు కోసం పంపించడం జరుగుతుందని ఇట్టి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సూచించిన గడువు లోగా పంపాలని అన్నారు. బల్దియా పరిధి 66 డివిజన్ ల నుండి ఎస్సి ఎస్టి బిసి మైనారిటీ కార్పొరేషన్ లకు సంబంధించి 36 వేల దరఖాస్తులు రావడం జరిగిందని, ఇందులో 30 వేల దరఖాస్తు ల పరిశీలన పూర్తి చేయడం జరిగిందని, మిగతా దరఖాస్తుల ను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా నోడల్ అధికారులు ఆలివేలు, రాజేశ్వర్, ఎల్ డి ఏం రాజు డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

# నేరేడ్‌మెట్ శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథ దేవాలయంలో రాజగోపురం శిఖర ప్రతిష్ఠాపన

**నీలగిరి వార్త మల్కాజిగిరి, మే 16, 2025:**
నేరేడ్‌మెట్ ప్రధాన రోడ్డుపై స్థాపించబడి 100 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథ దేవాలయంలో రాజగోపురం శిఖర ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం, సతీ సమేత నవగ్రహ దేవతా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ కార్యక్రమాలు మే 19, 2025 సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ తాండవ కాశీ క్షేత్రం పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించబడనున్నాయి.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి తదితర ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆలయ కమిటీ తెలిపింది.

**ఆలయ చరిత్ర**
1925లో బ్రిటిష్ పాలనా కాలంలో నేరేడ్‌మెట్ గ్రామంలో స్థానిక పెద్దలు బొంబాయి పెంకులతో చిన్న మందిరాన్ని నిర్మించారు. శ్రీ శివ భక్త భజన మందిరంగా పిలిచిన ఈ ఆలయంలో శివుని ఫోటోను ప్రతిష్ఠించి నిత్య పూజలు, భజనలు





నిర్వహించేవారు. 1992లో నూతన శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కాశీ క్షేత్రం నుంచి తెచ్చిన తేనె రంగు శివలింగం, సహజ సిద్ధంగా మూడు విభూతి నామాలతో ప్రతిష్ఠించబడింది. 1997లో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య శ్రీ విద్య నృసింహ భారతి స్వామిజీ చేతుల మీదుగా శివలింగ ప్రతిష్ఠ జరిగి, ఆలయానికి శ్రీ కాశీ విశ్వనాథ దేవస్థానంగా నామకరణం చేయబడింది. 2004లో ధ్వజస్తంభం, 2006లో శ్రీ అన్నపూర్ణ దేవి విగ్రహం, 2016లో శివ పంచాయతనం, 2018లో శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ముత్యాలమ్మ దేవాలయాలు ప్రతిష్ఠించబడ్డాయి. గోశాల నిర్మాణం కూడా పూర్తయింది.

**రాజగోపురం నిర్మాణం**
2024 ఏప్రిల్ 4న రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. మే 19, 2025న శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ జరగనుంది. ఆలయ కమిటీ త్వరలో కల్యాణ మండపం నిర్మాణాన్ని కూడా ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

# ముస్లింల ఆరాధ్య దైవమైన పీరీల మసీదుకి భూమి పూజ

**మాజీ సర్పంచ్ సొంత ఖర్చులతో నిర్మాణం**





**నిలగిరి వార్త, పెద్దపల్లి జిల్లా ప్రతినిధి :మే 16:**
పెద్దపల్లి జిల్లా అంతర్గం మండలం పొట్యాల గ్రామంలో ముస్లింల ఆరాధ్య దైవమైన పీరీల మసీదు నిర్మాణం కావాలని గ్రామ ముస్లింలు పొట్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఎదులాపురం నీరజ వెంకటేష్ ని అడగగా వారు సానుకూలంగా స్పందించి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్, మాజీ జెడ్పిటిసి అయోధ్య సింగ్ వారి దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశానుసారం తన సొంత ఖర్చులతో శుక్రవారం పీరీల మసీదుకి భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జడ్పిటిసి అయోధ్య సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతి గౌడ్ హాజరై ముస్లీమ్ లతో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లింలు పెద్దలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు మరింత వేగవంతం చేయాలి : పల్లా వెంకటరెడ్డి



**దేవరకొండ నీలగిరి వార్త**
ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండలో జరిగిన నియోజకవర్గ సిపిఐ కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలతో కష్టపడి పండించిన పంట నీటి పాలు అవుతూ రైతుల ఆవేదన చెందుతున్నారని ఐకెపి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు మరింత వేగవంతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయిందని, దేశాన్ని కార్పొరేట్ లకు తాకట్టు పెట్టి దివాళా తీయించిందని అన్నారు. మోడీ నమ్మిన బంటు ఆదానీకి ప్రభుత్వ రంగ సంస్థలను దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విపక్ష పార్టీల నాయకులపై సిబిఐ, ఈడి లను ప్రయోగిస్తున్న మోడీ ప్రభుత్వం ఆదానీపై ఎందుకు ప్రయోగించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వానిది నిర్లక్ష్య వైఖరి ఆవలంబిస్తుందని , విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా నిలిచి సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహా రెడ్డి , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ,తూము బుచ్చిరెడ్డి ,ఎస్ కనకాచారి, పోలే వెంకటయ్య , మైనుద్దీన్,ఉప్పునూతల వెంకటయ్య, కే జయ కృష్ణవేణి రాములు, బి అచ్చయ్య పాండురంగారెడ్డి , ఎన్ వెంకటేశ్వర్లు,జె వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు .సమావేశానికి నూనె వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

# పేదోళ్ల పాపం ఊరికే పోదు

**ఈ పాపం అదికారులదా లేక ప్రజా ప్రతినిధులదా ..**

**అనంతగిరి మండలం, చనుపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు రాని అమ్మనబోయిన నాగయ్య సొంత స్థలం ఉండి ఎలాంటి ఇల్లు లేని ఒక దళిత, వికలాంగ భాధితుడి ఆవేదన**



**నీలగిరి వార్త కోదాడ నియోజకవర్గం,సీఆర్కే, సూర్యాపేట జిల్లా,....**
ఇందిరమ్మ ఇండ్ల విషయంలో పేదలలో నిరుపేదలకి మొదటి ప్రాధాన్యత అని చెప్పిన ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను అర్హత కలిగిన నిరుపేదలకు ఎందుకు ఇవ్వట్లేదు
మొదటి విడతలో మొదటి పేరు గా రావాలసిన నా పేరు ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్ లో అసలు పేరు రాకపోవటానికి కారణం ఎవరిది పంచాయతీ సెక్రటరీదా లేక మండల అధికారులదా,...
మీకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని సొల్లు కబురులు చెప్పి ఇల్లు లేకున్న ఇంటిపన్ను కట్టించుకొని సర్వే చేసిన పంచాయతీ సెక్రటరీ ఇపుడు ఎందుకు వచ్చే విడత, వచ్చే విడత అని మాట దాటవేస్తుంది (మొదటి విడతలో పేదోడికి ముహూర్తం బాగాలేదా )
అధికారులకు నిజంగా మానవత్వం ఉండి ఉంటే ఇలా నాకు ఇల్లు రాకుండా చేసేవారు కాదు ఎందుకంటే ఈ రోజు నాకు ఇల్లు లేక ఎండకి ఎండుతూ , వానకి తడుచుకుంటూ ఒక రోడ్డు మీద జీవిస్తున్నాను ఇది మీ కళ్ళకు కనిపించకపోతే మా గ్రామంలో ఎవ్వరిని అడిగిన చెపుతారు లేక మీరే స్వయంగా వచ్చి చూసిన నా జీవనం మీకు అర్థమౌతాది మీకు నిజంగా మనసాక్షి అనేదే లేదా ఈ పేద వాడు మీకు ఏమి అన్యాయం చేసాడు, పేదవాడి జీవితంతో ఎందుకు రాజకీయం చేస్తున్నారు .నేను ఒక భాధితుడిగా నాకు అన్యాయం జరిగింది కావున నా ఆవేదనను అధికారులైన మీ దృష్టికి తీసుకువస్తున్న. తెలంగాణ ప్రజల నుండీ పన్నుల రూపంలో వచ్చే డబ్బులను జీతాలుగా తీసుకుంటున్న విజ్ఞనులు అయిన మీరు ఈ పేదవాడికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నాను .న్యాయం చేస్తారా లేదా అనేది అది విజ్ఞత తెలంగాణాలో ఒక నానుడు ఉంటది .పేదోడిని ఉన్నోడు కొడితే... ఉన్నోడిని పోచమ్మ కొట్టిద్ది.

# ఇందిరమ్మ ఇండ్ల పథకం భూమి పూజ

**పేదల సొంతింటి కల సాకారం**

**రాజంపేట (బిక్కనూర్), మే 16 (నీలగిరి వార్త)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద, పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా మరో అడుగు ముందుకు వేసింది. ఈ క్రమంలో శుక్రవారం బిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలో లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని, లబ్ధిదారునకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాన్ని అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ రెడ్డి, మాట్లాడుతూ, పేదలకు సొంత గూడు కల్పించే ఈ పథకం వారి జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరుస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ పథకం ద్వారా నిరుపేదలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించి, సొంత భూమి లేని వారికి ఉచితంగా స్థలం కేటాయిస్తున్నట్లు చంద్రకాంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి మార్గదర్శనం అందించిన ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటిస్తూ,



అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నాయకులు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 2028 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొని, పథకం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. జంగంపల్లి గ్రామంలో ఈ భూమి పూజ కార్యక్రమం పేదలకు నూతన ఆశలను రేకెత్తించింది.

# శ్రీ సిద్ధరామేశ్వర దేవాలయ ఈవోపై ఆరోపణలు

**రాజంపేట (బిక్కనూర్) మే 16 (నీలగిరి వార్త)**
శ్రీ సిద్ధరామేశ్వర దేవాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈవో పి. శ్రీధర్‌పై కొంతమంది వ్యక్తులు అక్రమాల పేరుతో వ్యక్తిగత విమర్శలు చేయడం అనుచితమని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వ్యాఖ్యలు గుడి పవిత్రతకు భంగం కలిగిస్తున్నాయని, దేవాలయ అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని తెలిపారు. శ్రీధర్ ప్రస్తుతం 12 మండలాలకు ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారని, అదనంగా సలాబత్పూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో సిబ్బంది కొరత ఉన్న పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో ఈవో సమయం కేటాయించేందుకు సలాబత్పూర్ బాధ్యతల నుంచి తప్పించి శ్రీసిద్ధ రామేశ్వర దేవాలయానికి మాత్రమే ఈవోగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆలయంలో గుమాస్తా, అటెండర్, నైట్ వాచ్మన్ లు లేని పరిస్థితుల్లో స్వీపర్లు అవసరమైనప్పుడే రావడం వల్ల పరిపాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఆలయ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, వారి



వెనుక ఉన్న రాజకీయ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీనిపై సమగ్ర విచారణ జరుగుతుందనీ, త్వరలోనే నిజాలు ప్రజల ముందుంచుతామని తెలిపారు. తదేకంగా, కొందరు మీడియా సంస్థలు తప్పుడు కథనాల ద్వారా ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి కథనాలపై దేవాదాయ శాఖ, ఆలయ యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కరోల రాజు, దప్పు రవి, గోస్ ఎండి సాజిత్, రమేష్, జంగం సుధాకర్, భాను తదితర నాయకులు పాల్గొన్నారు.

# సమ్మె తేదీ మాత్రమే వాయిదా,కార్మికుల పోరాటం కాదు

**టి ఎన్ టి యు సి రాష్ట ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి**

**నీలగిరి వార్త,హుజూర్ నగర్**
బిజెపి 10 సంవత్సరాల పాలనా కాలంలో 16 లక్షల 35 వేల కోట్ల రూపాయలు కార్పొరేట్ల సంస్థలకు పన్ను మాఫీ రూపంలో లబ్ధి చేకూర్చారని, ప్రభుత్వ విద్య ,వైద్యం,గ్రామీణ ఉపాధి హామీ,ఐసిడిఎస్ పథకాల వార్షిక బడ్జెట్లలో కోతలు పెట్టడం జరిగిందని టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి తీవ్రంగా విమర్శించారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి లక్ష్మీ నరసింహా రావుకి,వర్తక సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పకి సమ్మె నోటీస్ లను ఇచ్చిన అనంతరం కార్మికులతో రోషపతి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని,అవి ఇవ్వకుండా మరిచిపోయి ప్రజల ఆస్తిగా ఉన్న రైల్వే,రోడ్లు,ఎయిర్లైన్స్ బిఎస్ఎన్ఎల్ తదితర మౌలిక రంగాలు ప్రవేట్ పరం చేస్తూ నేషనల్ ఎస్సెట్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో లక్షల ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతున్నారని,మైన్స్ డెవలప్మెంట్ అండ్ ఆపరేటింగ్ పేరుతో ప్రైవేట్ కార్పొరేట్లకు భాగస్వామ్యం,కల్పిత దేశ భద్రత కూడా ప్రమాదం తీస్తున్నారని, ఇన్సూరెన్స్ రంగాల్లో



100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడును అనుమతించారని, పోస్టల్ శాఖ కార్పొరేట్ లాజిస్టిక్ సంస్థగా మార్చేశారని, పర్యావరణ పేరున విద్యుత్ బస్సులు తెచ్చి కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ ఆర్టీసీ బస్సులను బలహీనం చేస్తున్నారని విమర్శించారు. అందుకోరకే జాతీయ కార్మిక సంఘాలన్ని మే 20 సమ్మె చేయాలని నిర్ణయించగా భారత్, పాకిస్తాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో వాయిదా వేయడం జరిగిందని, జులై 9న,సమ్మె ఉంటుందని,రైస్ మిల్ డ్రైవర్లు, హమాలీలు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించాలని రోషపతి కోరారు.
ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి నాయకులు,రైస్ మిల్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు గుండె పోయిన వెంకన్న యాదవ్, దిన కూలీల యూనియన్ అధ్యక్ష్య, కార్యదర్శి స్వరూప, సుకన్య, కోటమ్మ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం 18వ వార్డు ఇన్చార్జి యుగంధరా చారి

**నియామక పత్రం అందజేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాసరావు**

**నీలగిరి వార్త,హుజూర్ నగర్**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని 18వ, వార్డు ఇన్చార్జిగా ఎం.యుగంధరా చారి ని నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాసరావు శుక్రవారం పట్టణంలోని పీర్ల కొట్టం సెంటర్లో నియామక పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ధూళిపాళ శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 28 వార్డులలో ఇన్చార్జీలను నియమిస్తున్నట్లు తెలిపారు. వార్డుల వారిగా బలోపేతం చేపడుతున్నట్లు,తద్వారా బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు



కొనసాగుతున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. బీసీ లకు జరుగుతున్న అన్యాయాలపై కింది స్థాయి నుండి నాయకత్వానికి వివరిస్తూ ప్రభుత్వపరంగా అందవలసిన పథకాలను సాధించే దిశగా ఉద్యమం ముందు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు గూడెపు దీప,పట్టణ ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహా చారి, గోపాలపురం గ్రామ అధ్యక్షుడు కాలువ వెంకటేశ్వరరావు, కుక్కునూరి శ్రీనివాస్,శెట్టి శ్రీనివాస్,కర్నె కృష్ణ,కొట్టు శేఖర్,రుద్రోజు శ్రీనివాసా చారి, అన్నదానం గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందించిన యువ నాయకులు బాబు



**నీలగిరి వార్త ఎల్లారెడ్డి:-**
ఎల్లారెడ్డి 6వ వార్డు ఇందిరానగర్ కాలనీ లోన ఎర్రోళ్ల రామ కిస్టయ్యా మరణించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లారెడ్డి ఎస్ ఎస్ సి ఎల్ టౌన్ ప్రెసిడెంట్ ఎల్లుబాబు .మదన్ మోహన్ అన్న ఆదేశాల మేరకు రెండు వేయిల రూపాయలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

# వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్



**నీలగిరి వార్త ఎల్లారెడ్డి:-**
ఎల్లారెడ్డి మండల కట్టకింది తండ గ్రామానికి చెందిన బాధ్య నాయక కూతురి వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ గారు , నూతన వధూవరులను ఆశీర్వదించారు.. వారితో పాటు పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ , శ్రీను నాయక్ , బర్కత్, పడమటి దయాకర్, భూపాల్ పాల్గొన్నారు.

# పదవులు ఉన్నా లేకున్నా నిబ్బదతో వెళ్తాం

**మొగిలిపల్లి భూమేష్ గుప్తా.**

**నీలగిరి వార్త జిల్లా ప్రతినిధి సుందర్:-**
కామారెడ్డి పట్టణ కేంద్రంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మొగిలి పల్లి భూమేష్ గుప్తా మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి జన్మ దిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు నభూతో నాభవిష్యత్తు అన్న విధంగా కార్యక్రమం నిర్వహించిన సంగతి అందరికీ తెలిసిన విషయమే . ఈ ప్రోగ్రాంకి సర్వత్ర ప్రశంసలు వచ్చాయని పదవిలో ఉన్నా



లేకున్నా కామారెడ్డి వైశ్యులకు మా నూతన కార్యవర్గం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని పదవులు శాశ్వతం కాదని మోగిలిపల్లి భూమేష్ గుప్తా తెలియజేయడం జరిగింది.

# ఘనంగా బొడ్డు గోపాల్ జన్మదిన శుభాకాంక్షలు



**దేవరకొండ నీలగిరి వార్త**
దేవరకొండ మండలం తాటికొల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలో పాల్గొన్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్.. గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలకు మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపాల్ గౌడ్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు మల్లేష్, సామల బాలరాజు, బొడ్డుపల్లి కృష్ణ,సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ ప్రధాన కూరగాయల మార్కెట్ నూతనంగా ఎన్నికైన వర్తక సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండా సురేఖ



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

శుక్రవారం లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షులు స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, అధ్యక్షులు జాతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మున్నాభాయ్, కోశాధికారి మల్లూరి బాబురావు, ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు కొండా సురేఖని మర్యాదపూర్వకంగా కలిసి 158 మంది కాంప్లెక్స్ వర్తకుల కిరాయి చార్జిలు తగ్గించాలని, హమాలి కార్మికుల, మార్కెట్ వర్తకుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వారికి విశ్రాంతి భవనాన్ని నిర్మించాలని, అదేవిధంగా హెూల్సేల్ దుకాణాల ముందు రేకుల షెడ్లు నిర్మాణం కోసం స్థానిక శాసనసభ్యులు మరియు మంత్రివర్యులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా కోరుకోవడం జరిగింది, దీనికి మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి లక్ష్మీపురం కూరగాయ మార్కెట్లో పనిచేసే ప్రతి ఒక్క వర్తక వాణిజ్య ,వ్యాపార, సముదాయాలకు కాంగ్రెస్ ప్రభుత్వము ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని వాళ్ల శ్రేయస్సు కోసము కొండా దంపతులు ఎల్లవేళలా కృషి చేస్తారని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో జారతి రమేష్, మజీద్ అహ్మద్ బాబా ,కర్ర నాగేశ్వరరావు, పరుషగోపి, కర్ర వెంకన్న , కాసర్ల రాజు, నాగరాజు, జారతి వెంకన్న, హరి, శ్రీనివాస్ ,రమేష్, చందు, సూరం రాజేందర్, దమరకొండ కర్ణాకర్ ,ప్రసాద్ ,రాజు, సుధాకర్, ఇమ్రాన్, ఏసు ,మినీ హెూల్ సేల్ ,చిల్లర వ్యాపారులు, 158 కాంప్లెక్స్, ఆకుకూరల వ్యాపార పాల్గొన్నారు.

## డెంగ్యూ పై అవగాహన ర్యాలీ




ఇల్లందు నీలగిరి వార్త ప్రతినిధి

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ మురళి కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో డెంగ్యూ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నిల్వ ఉంచిన మంచినీటిలో వృద్ధి చెంది పెరిగే వీడియోస్ దోమ డెంగ్యూ వైరస్ ఉన్న వ్యక్తులను కుట్టి ఆరోగ్యవంతులను కుట్టడం ద్వారా ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. తీవ్రమైన తలనొప్పి అధిక జ్వరం కండరాలు కీళ్ల నొప్పులు కంటి వెనకాల నొప్పి వాంతులు వికారం నీరసం చర్మంపై దద్దులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ నిర్ధారణ కొరకు చేసే ఎలిసా పరీక్ష చేయించుకోవాలని కోరారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స తీసుకోవాలని లేని పక్షంలో తీవ్రత అధికం అయితే శరీరంలో ప్లేట్లెట్స్ సంఖ్య పడిపోయి అంతర్గత రక్త శ్రావణ్ జరిగి ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రధానంగా వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కంటే రాకముందే నివారణ చర్యలు స్వచ్ఛందంగా తీసుకోవాలని కోరారు. ప్రజలు ప్రతి మంగళ శుక్రవారం లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. దోమలు కుట్టకుండా ఉండడానికి దోమతెరలు దోమ రసాయనాలు వాడాలని, కిటికీలకు తలుపులకు దోమ జాలీలను అమర్చుకోవాలని నిండుగా బట్టలు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిణి, ఎస్ టి ఎస్ శంకర్, ఎల్టి రాజేష్, ఏఎన్ఎం, ఆషా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

హనుమకొండ జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

హనుమకొండ వరంగల్ అర్బన్ సహకార బ్యాంకు సేవలను అందరూ వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా సహకార అధికారి బి. సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రశాంత్ నగర్‌లోని వరంగల్ అర్బన్ సహకార బ్యాంక్ బ్రాంచ్ లో సమావేశాన్ని నిర్వహించారు. బ్రాంచ్ లో సభ్యులు, డిపాజిటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సభ్యుడు స్వయం సహాయం, సమిష్టి బాధ్యత, సమానత్వం సామాజిక బాధ్యతతో సహకార బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ప్రజా బ్యాంకుగా అభివృద్ధి చేసి బ్యాంకు ద్వారా సేవలు పొందాలని కోరారు. ప్రతి సభ్యుడు పొదుపు ద్వారా వాటాదనం చెల్లించడం ద్వారా బ్యాంకు పరపతిని పెంచు తుందని అన్నారు. బ్యాంకులో లాకర్ల సౌకర్యం ఉందని, ప్రజలు అందరు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రాంత ప్రజలకు కోర్ బ్యాంకింగ్ సిస్టం ఏటీఎమ్స్, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రసాద్, బ్యాంకు మేనేజర్ సురేందర్ రెడ్డి, హనుమకొండ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, గోపాలపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, డిపార్ట్మెంట్ అధికారులు శ్రీనివాసరావు కృష్ణవేణి, సంధ్యారాణి, బ్యాంకు వాటాదారులు సభ్యులు పాల్గొన్నారు.

## ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ వారిలో సత్ప్రవర్తన తీసుకురావడమే జైళ్ళ శాఖ లక్ష్యం



జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ వారిలో సత్ప్రవర్తన తీసుకురావడమే జైళ్ళ శాఖ లక్ష్యమని జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా అన్నారు. రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద ఈ నెల 16 నుండి 26 వరకు జరుగుతున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వివిధ హస్తకళలు, చేనేత వస్తువులను ప్రోత్సహించుటకు స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా వరంగల్ రేంజ్ జైళ్ళ శాఖ ద్వారా ఖైదీలచే తయారు చేయించిన వివిధ వస్తువుల కొనుగోళ్ళకై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను శుక్రవారం జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ జైళ్ళ శాఖలో ఖైదీల పనితీరును ప్రోత్సహించుటకు వారికి వివిధ రంగాలలో శిక్షణ కల్పిస్తూ నాణ్యమైన వస్తువులను వారిచే తయారు చేయించి ఉపాధి కల్పిస్తూ వారిలో సత్ప్రవర్తన తీసుకొస్తూ వారికి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా జైళ్ళ శాఖ పనిచేస్తుందని తెలిపారు. ప్రజలందరూ ఇట్టి స్టాళ్లను ఆదరించి నాణ్యమైన సరళమైన ధరలకు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి టీ కళాసాగర్, ఉప పర్యవేక్షణాధికారులు పి వెంకటేశ్వర స్వామి, జైలర్ పి పూర్ణచందర్, పరకాల సబ్ జైల్ పర్యవేక్షణాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

కార్యకర్తలను,నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంత్రి కొండా సురేఖ హనుమకొండ రామ్ నగర్ లోనీ తమ నివాసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు రాంనగర్ లోని తమ నివాసానికి చేరుకుని తమ సమస్యలను మంత్రి కొండా సురేఖకి విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి కొండా సురేఖ సహృదయంతో విని సంబంధిత పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనకాడనని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని కొండా సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎవరు ధైర్యపడవలసిన అవసరం లేదని బడుగు, బలహీన వర్గాలజీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని మంత్రి కొండా సురేఖ భరోసానిచ్చారు.

## వీధి దీపాలు సెంట్రల్ లైటింగ్ నిర్వహణ పగడ్బందీగా జరగాలి



నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త

వీధి దీపాలు సెంట్రల్ లైటింగ్ నిర్వహణ పగడ్బందీగా జరగాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యల్లో భాగం గా నగరం లో లైటింగ్ నిర్వహణ లో బ్లాక్ స్పాట్‌ల గుర్తింపుతో పాటు అందుకు అవసరమైన సామాగ్రి పరికరాలను కొనుగోలు చేయాలని నగర వ్యాప్తం గా ఉన్న 83750 వీధి దీపాలన్ని సక్రమం గా పనిచేసేలా చూడాలని, ప్రధానం గా విలీన గ్రామాల్లో అంధకారం లేకుండా వీధి దీపాలు వెలిగేలా చూడాలని మేయర్ అన్నారు.

నీటి సరఫరా తీరును సమీక్షించిన మేయర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి చివరి పాయింట్ వరకు నీటి సరఫరా జరిగేలా చూడాలని ఎప్పటికప్పుడు లీకేజీ లను అరికట్టాలని నీరు అందని చివరి ఏరియాలకు నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా జరగాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ ఈ ఈ లు రవికుమార్ సంతోష్ బాబు మాధవి లత డి ఈ కార్తీక్ రెడ్డి ఏ ఈ సరిత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధరామేశ్వర దేవాలయ ఈవోపై ఆరోపణలు

రాజంపేట (బిక్కనూర్) మే 16 (నీలగిరి వార్త)



శ్రీ సిద్ధరామేశ్వర దేవాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈవో పి. శ్రీధర్‌పై కొంతమంది వ్యక్తులు అక్రమాల పేరుతో వ్యక్తిగత విమర్శలు చేయడం అనుచితమని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వ్యాఖ్యలు గుడి పవిత్రతకు భంగం కలిగిస్తున్నా యని, దేవాలయ అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని తెలి పారు. శ్రీధర్ ప్రస్తుతం 12 మండలాలకు ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారని, అదనంగా సలాబత్పూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో సిబ్బంది కొరత ఉన్న పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో ఈవో సమయం కేటాయించేందుకు సలాబత్పూర్ బాధ్యతల నుంచి తప్పించి శ్రీసిద్ధ రామేశ్వర దేవాలయానికి మాత్రమే ఈవోగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆలయంలో గుమాస్తా, అటెండర్, నైట్ వాచ్మన్ లు లేని పరిస్థితుల్లో స్వీపర్లు అవసరమైనప్పుడే రావడం వల్ల పరిపాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఆలయ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, వారి వెనుక ఉన్న రాజకీయ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీనిపై సమగ్ర విచారణ జరుగుతుం దనీ, త్వరలోనే నిజాలు ప్రజల ముందుంచుతామని తెలిపారు. తదేకంగా, కొందరు మీడియా సంస్థలు తప్పుడు కథనాల ద్వారా ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి కథనాలపై దేవాదాయ శాఖ, ఆలయ యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కరోల రాజు, డప్పు రవి, గోస్ ఎండి సాజిత్, రమేష్, జంగం సుధాకర్, భాను తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్వేతార్క గణపతికి మామిడిపళ్ళ రసంతో అభిషేకం

వరంగల్ సిటీ నీలగిరి వార్త.



స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో నేడు సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామివారికి 108 లీటర్ల మామిడిపళ్ళ రసంతో విశేష అభిషేకం నిర్వహించడం జరిగింది బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ శర్మ అయినవోలు సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి అభిషేకని తిలకించారు ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు సీనమ్మ రజిత సబితా ఉమాదేవి అరుణాదేవి వెంకట సాయి తేజ చందు సదానందం శ్రీనివాస్ చొక్కారపు శ్రీనివాస్ బాపురావు దేవాలయ సిబ్బంది మేనేజర్ లక్క అసిస్టెంట్ మేనేజర్ దుర్గం సుదీర్ పిఆర్వో మని శ్రీనివాసరావు పద్మ తదితరులు పాల్గొన్నారు పూజ అనంతరం భక్తులందరికీ అభిషేకం చేసిన మామిడిపళ్ళ రసాన్ని తీర్థ ప్రసాదం గా వితరణ చేయడం జరిగింది అనంతరం అన్నపూర్ణ భవన్లో భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.

## సార్వత్రిక సమ్మె వాయిదా




ఇల్లందు నీలగిరి వార్త ప్రతినిధి

ఈనెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9 కి వాయిదా వేసినట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ తెలిపారు. పెహల్గాం ఉగ్రదాడి, భారత్ పాక్ మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడి దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక సంఘాలు ఢిల్లీలో సమావేశమై సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మే 20న ర్యాలీలు సభలు నిర్వహించాలని సమ్మె ప్రచారం కోసం పాటుపడిన కార్యకర్తలకు సహకరించిన అధికారులకు యజమానులకు రైతు వ్యవసాయ కూలీలకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఐ వెంకటేశ్వర్లు, జై ఉపేంద్ర చారి, అంజన్న, నాగరాజు, తాళ్లూరీ కృష్ణ, ఉమాదేవి, లక్ష్మణరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం భూమి పూజ

పేదల సొంతింటి కల సాకారం



రాజంపేట (బిక్కనూర్), మే 16 (నీలగిరి వార్త)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద, పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా మరో అడుగు ముందుకు వేసింది. ఈ క్రమం లో శుక్రవారం బిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలో లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు పాల్గొని, లబ్ధిదారునకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాన్ని అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా చంద్రకాంత్ రెడ్డి, మాట్లాడుతూ, పేదలకు సొంత గూడు కల్పించే ఈ పథకం వారి జీవన ప్రమాణాలను గణ నీయంగా మెరుగుపరుస్తుందని అన్నారు. ప్రభుత్వం అం దిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ పథకం ద్వారా నిరుపేదలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించి, సొంత భూమి లేని వారికి ఉచితంగా స్థలం కేటాయిస్తున్నట్లు చంద్రకాంత్ రెడ్డి వివరిం చారు. ఈ కార్యక్రమం విజయవంతానికి మార్గదర్శనం అం దించిన ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథ కం కింద లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటిస్తూ, అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నాయకులు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 2028 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొని, పథకం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. జంగంపల్లి గ్రామంలో ఈ భూమి పూజ కార్యక్రమం పేదలకు నూతన ఆశలను రేకెత్తించింది.